

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

పరిశ్రమలు స్థాపించే యాజమాన్యాలు ఆయా ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్.పైడిపాల గ్రామ పరిధిలో క్వారీ లీజుకు ఇచ్చే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి పాల్గొని ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ క్వారీ లీజు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని, అయితే ఆ క్వారీలో పనిచేసేందుకు స్థానిక యువతకు అవకాశం కల్పించాలని కోరారు. సాంకేతికతను అడ్డుపెట్టుకుని తమకు ఉపాధి లేకుండా చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామ సభ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు.

కేంద్రీకృత విజ్ఞాన కేంద్రంగా నన్నయ

వ్యవస్థాపక దినోత్సవంలో వక్తలు




ప్రజాశక్తి - రాజానగరం

కేంద్రీకృత విజ్ఞాన కేంద్రంగా నన్నయ యూనివర్సిటీ నిలుస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 19వ వ్యవస్థాపక దినోత్సవాన్ని యూనివర్సిటీలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విసి ప్రసన్నశ్రీ, ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత, సమ్మిళిత క్యాంపస్ వాతావరణాన్ని నిర్మించడంలో గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. విద్యార్థులు నేర్చుకోవడానికి, ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అందించాలనే చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. జాతీయ విద్యా విధానాన్ని అర్థవంతంగా అమలు చేయడం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి అన్నారు. విశ్వవిద్యాలయాన్ని ఒక శక్తివంతమైన, విద్యార్థి-కేంద్రీకృత విజ్ఞాన కేంద్రంగా నన్నయ వర్సిటీని మార్చుతామన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తనిఖీల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. కళాశాలలు ఉత్తమ అభ్యాసాలు ప్రశంసిస్తామని, ఏవైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మోడల్ మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీగా నిలిపేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు మాట్లాడుతూ యూనివర్సిటీ లక్ష్యం అకడమిక్ ఎక్సలెన్స్ సాధించడం, పరిశోధనలను ప్రోత్సహించడం సమాజంలో నిమగ్నమవ్వడం అన్నారు. "సర్వత్ర విద్యా వర్ధతే ప్రజా" అనే నినాదాన్ని నిలబెట్టుకోవడం ద్వారా ప్రజల సుసంపన్నతకు దారితీస్తుందన్నారు. ఏడాది 2.01 బిలియన్ టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. 13 మిలియన్ హెక్టార్ల అటవీ ప్రాంతం తరగి పోతుందన్నారు. మానవ కార్యకలాపాల వల్ల 1 మిలియన్ జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం ప్రకృతికి అనుగుణంగా జీవించడంపై ఉద్ఘాటించడం ద్వారా ఎర్త్ డే వేడుకలను ప్రేరేపిస్తుందన్నారు. నీటి సంరక్షణ, స్థిరమైన వ్యవసాయం, పునరుత్పాదక ఇంధన ప్రయత్నాలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, అలాగే పర్యావరణ అవగాహన, స్థిరత్వాన్ని ప్రోత్సహించే సాంస్కృతిక కార్యక్రమాలు భూమిని రక్షించడానికి, మనం స్థిరమైన పద్ధతులను అనుసరించాలన్నారు. మానవులంతా పర్యావరణ హితంగా జీవించాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. యూనివర్సిటీ కూచిపూడి డిప్లమా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఇంటర్నేషనల్ బీట్ బాక్సింగ్ వాయిస్ ప్లేయర్ రమేష్ తన గొంతుతో వివిధ వాయిద్య శబ్దాలను చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందించారు. తొలుత ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆవరణలో అతిథులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇఎపి సెట్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



జెఎన్‌టియుకె విసి ప్రసాద్

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎపిఇఎపి సెట్-2025 ఛైర్మన్, జెఎన్‌టియుకె విసి ప్రొ సివిఎస్‌ఆర్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎపిఇఎపి సెట్ ప్రవేశ పరీక్షకు ఇప్పటివరకు 3,41,355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 46, హైదరాబాద్‌లో రెండు రీజనల్ సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,66,392 మంది దరఖాస్తు చేసుకోగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 74,172 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెండు విభాగాలకు 791 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎపి ఇఎపి సెట్-2025 కన్వీనర్ ప్రొ వి. సుబ్బారావు తెలిపారు. మే 19, 20 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. [illegible] రూ.1000 అపరాధ రుసుంతో మే 1వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుంతో మే 7వ తేదీ వరకు, రూ.4వేలు అపరాధ రుసుంతో మే 12వ తేదీ వరకు, రూ.10వేలు అపరాధ రుసుంతో మే 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తుల్లో ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరించినట్లయితే వారు ఇఎపి సెట్ హెల్ప్ లైన్ సెంటర్‌ను సంప్రదిస్తే మే 6వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మే 12వ తేదీ నుంచి విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్ల ద్వారా తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.

పిఎం సూర్యఘర్ పథకం అమలుకు చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలో మహిళా స్వయం శక్తి సంఘాల ద్వారా పిఎం సూర్యఘర్ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. మంగళవారం స్థానిక టిటిడిసిలో పిఎం సూర్య ఘర్ పథకంపై డిఆర్‌డిఎ సిఆర్‌పిలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకంలో ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఒక కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు రూ.60 వేలు ఖర్చు అవుతుందని, అందులో 80 శాతం రూ.48 వేలను బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని, మిగిలిన రూ.12 వేలను స్త్రీ నిధి నుంచి మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో ఉన్న 40 వేల స్వయం సహాయక గ్రూపులలో ప్రతి గ్రూపు నుంచి కనీసం ఒక సభ్యురాలు అయినా పిఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న నాలుగేళ్లలో బ్యాంకు రుణం పూర్తిగా తీరిపోతుందని, అనంతరం ప్రతినెల రూ.750 విలువైన సోలార్ విద్యుత్తును సొంతంగా తయారు చేసుకుని వినియోగించుకోవడం జరుగుతుదన్నారు. ఈ సమావేశంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇఇ ప్రభాకర్, ఎడిఇ కిరణ్, ఎఇ రమేష్‌కుమార్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తుని

దళిత మహిళపై లైంగిక దాడి, సాక్షులపై భౌతికదారులకు పాటుపడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కొండారుపేటకు చెందిన లైంగిక దాడి గురైన బాధితురాలు ఆరుగుల భవానీ, సాక్షులైన ఆరుగుల గంగరాజు, వాణి కుమారిలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన కొండారుపేటకు చెందిన ఆరుగుల భవానిపై టిడిపి కార్యకర్త లావేటి సతీష్ లైంగిక దాడికి పాల్పడిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఫిబ్రవరి 20న ఎస్‌పికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని అన్నారు. ఈ కేసులో సాక్షులుగా ఉన్న ఆరుగుల గంగరాజు, అతని భార్య వాణికుమారిలను బెదిరింపులకు గురి చేశారని తెలిపారు. ఈ అంశాన్ని కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామని, కానీ లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదని వివరించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని అన్నారు. లైంగిక దాడికి పాల్పడి సాక్షులపై భౌతిక దాడులు చేసి తీవ్రంగా గాయపడిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లాలో పోలీసు వ్యవస్థ పని చేస్తుందో లేదో అర్థం కావడం లేదని అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తుని నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు లంక కృపానందం, సోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జగటాల వీరబాబు, లగుడు శ్రీను చింతకాయల చినబాబు, గరిసింగు దొరబాబు పాల్గొన్నారు.

పేద పిల్లలకు విద్యను దూరం చేయొద్దు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విద్యారంగంలో సంస్కరణల పేరుతో ఉన్న పాఠశాలలను మూసివేసి పేద పిల్లలను విద్యకు దూరం చేయొద్దని సిపిఎం మండల కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని పొన్నాడ గ్రామంలో ఎస్‌సి పేటలో ఉన్న ఏకైక పాఠశాలను మూసివేసి మోడల్ స్కూల్ పేరుతో కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిని నిరసిస్తూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మా బడి మూసి వేయవద్దు అనే నినాదంతో పాఠశాల ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా గుర్రాల అప్పారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాఠశాలలను మూసివేసి కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్ళమనడం దారుణమని అన్నారు చిన్నపిల్లలు అంత దూరం వెళ్లాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల పిల్లలు విద్యకు దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. గత సిఎం జగన్మోహన్ రెడ్డి మోడల్ స్కూల్ పేరుతో పాఠశాలలను విలీనం చేస్తే, ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు పేద పిల్లలను విద్యకు దూరం చేసేలా పాఠశాలలను మూసివేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్‌సి పేటలో ఉన్న పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసరావు, సురేఖ, మంగరత్నం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు



సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లీదండ్రులు

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం ఆర్‌సికెల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎఫ్‌కె. పాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గ్రేడ్ ఏ రకాలకు (75 కిలోలకు గాను)రూ.1740, సాధారణ రకాలకు రూ.1725 లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. 24 గంటల నుంచి 48 గంటల లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ పి.స్వాతి, మండల వ్యవసాయ అధికారి ఎ.అచ్యుతరావు, సర్పంచ్ మహాలక్ష్మీ శేఖర్, రైతులు, విఎఎలు పాల్గొన్నారు. **సామర్లకోట** దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా రైతు సేవా కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ దేవుల నాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని ఉండూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మిల్లులకు రోజువారి పరిమితి విధించడం వలన ధాన్యం విక్రయాల్లో ఆలస్యం జరుగుతుందని, నివారణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు, రేపటి నుంచి రోజు వారి పరిమితిని తొలగిస్తామని రైతులకు దేవుల నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు శాంతికమల, సతీష్, వి.తేజస్విని, రైతులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని శీల గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని తహశీల్దార జి.రవీంద్రనాథ్ ఠాగూర్ మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ శాఖ సహాయకులు రామకృష్ణ, విఆర్ఒ సూర్యనారాయణమూర్తి, రైతులు, కౌలు రైతుల పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌మీనా

కళాశాలకు ఫ్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక మహారాణి కళాశాలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ 25 ఫ్యాన్లు బహుకరించారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రంగనాగ్ కొన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు లేకపోవడాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఆయన మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయికి ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, అధ్యాపకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



ఉపాధ్యాయుడిని సన్మానించిన ఎంపిపి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తున్న తిరుమాలి మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ సీనియర్ నేత టి.శ్రీనివాసరావును ఎంపిపి గొల్లపల్లి బుజ్జి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ క్లాస్ రూమ్ ట్రాన్సాక్షన్ ప్రోగ్రాంలో శ్రీనివాసరావు చిన్నపిల్లల తల్లిదండ్రులను ఆకర్షించేలా వినూత్నంగా పాఠశాలలో వెల్కమ్ బోర్డు తయారు చేసి పలువురిని ఆకర్షించారని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ, ఎంఇఒ బి.అబ్బాయి, సర్పంచ్ సూతి కృష్ణప్రసాద్, ఎంపిటిసి సభ్యులు పసల సూరిబాబు, గ్రామ కార్యదర్శి ఉష, హెచ్‌ఎం పి.బాబూరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

నవోదయలో ఎన్‌సిసి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయంలో మంగళవారం 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ వరకు జరిగే శిక్షణా శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిస్ మాట్లాడుతూ ఈ క్యాంపులో విద్యార్థుల ప్రత్యేక ప్రతిభను గుర్తించి వారిలో నైపుణ్యాలను మరింతగా మెరుగుపరిచేందుకు శిక్షణ ఇస్తారన్నారు. ఇంటర్ డైరెక్టర్ స్పోర్ట్స్ అండ్ షూటింగ్ కాంపిటీషన్‌కు సంబంధించిన క్యాండిడేట్స్ ఇటిసి-1లో భాగం కావడం ఈ శిబిరం ప్రత్యేకతన్నారు. ఈ క్యాంపులో సుబేదార్ మేజర్ ఆఫీసర్ హేమంత్ కుమార్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్స్, పర్మినెంట్ ఇన్స్ట్రక్షన్ స్టాఫ్, సివిల్ స్టాఫ్, లెఫ్టినెంట్ ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్ చేస్తున్న ఎన్‌సిసి క్యాండెట్లు

మల్లం ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మల్లం గ్రామంలో ఎస్‌సిల సాంఘిక బహిష్కరణకు కారకులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విముక్తి చిరుతల కక్షి (విసికె) పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పల్లపు సురేష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ఏ విధమైన వస్తువులను, తినుబండారాలను అమ్మకుండా షాపులు యజమానులు అమానుషంగా ప్రవర్తించారన్నారు. వెలివేతకు కారణం అయిన అగ్రవర్ణ వ్యక్తులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జరిగిన ఘటన కు బాధ్యత వహిస్తూ తక్షణమే డిప్యూటీ సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ నాయకులు శెట్టిబత్తుల తులసీ, అంబేద్కర్ కోనసీమ జిల్లా విసికె పార్టీ కార్యదర్శి మెండి డేవిడ్, పెయ్యాల ప్రతాప్, సాపే రమేష్ పాల్గొన్నారు. అలాగే దళితుల సాంఘిక బహిష్కరణకు కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్, సామాజిక కార్యకర్త తోట రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం బాధితులను కలిసి వారు నిజనిర్ధారణ చేపట్టారు.

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - శంఖవరం

మండల పరిధిలో గుర్తించిన పలువురు వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఒ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వత రాజబాబు పాల్గొని వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్ది మణి రామారావు, పర్వత సురేష్, మేడిశెట్టి కిరణ్, వెన్న శివ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి, సామర్లకోట

మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ అండ్ సైన్స్) డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాతావరణ మార్పులు పరిష్కరించడానికి, జీవవైవిధ్యాన్ని రక్షించడానికి సమిష్టి కృషి అవసరమని అన్నారు. ఈ సందర్భంగా సూరంపాలెం, యర్రంపాలెం ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు నగదు, జ్ఞాపికలతోపాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రో వి.సత్యనారాయణ, కో-ఆర్డినేటర్ డాక్టర్ అభిషేక్ త్రిపాఠి, కో-కోఆర్డినేటర్ ప్రో ఎస్.జగదీష్, గ్రంథాలయ అధికారి కె.అశోక్‌కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టి. గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోటలోని హైస్కూల్‌లో ధరిత్రి దినోత్సవాన్ని ఆదిత్య యూనివర్సిటీ ఎకో క్లబ్, పాఠశాల ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఐఎఫ్‌పి ప్యానెల్ ద్వారా ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు, ఈ వేస్ట్ గురించి వివరించారు. మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది నినాదం ప్లానెట్ మరియు ప్లాస్టిక్‌పై హెచ్‌ఎం సాయి రామకృష్ణ ఫ్యాకల్టీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ ఎ.లక్ష్మీలావణ్య, కె.మృదులదేవి, పి.అన్నపూర్ణ, డాక్టర్ జి.ప్రకాష్, సిహెచ్.హేమలత, తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో మొక్కలు నాటుతున్న నిర్వాహకులు



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

టిడిపి నాయకుడు రాజబాబు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చిన్నబ్రహ్మదేవం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, ఎఎంసి మాజీ ఛైర్మన్, నీటి సంఘం మాజీ అధ్యక్షులు ఆచంట రాజబాబు మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. సోమవారం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణవార్తను తెలుసుకున్న ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆయన స్వగృహానికి చేరుకుని ఆయన మృతిదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, నాయకులు నూనె రామారావు, మొయిళ్ళ కృష్ణమూర్తి, రేలంగి వెంకట్రావు, జలదాని సుబ్రహ్మణ్యం, కంచుమర్తి కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధులకు స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

తుని పట్టణంలో క్రైస్తవులకు సమాధుల కోసం స్థలాన్ని కేటాయించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు తుని పాస్టర్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు బోడపాటి కాంతం మంగళ వారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రైస్తవులు ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాన్ని సమాధి చేసేందుకు స్థలం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కావున క్రైస్తవుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కాజులూరు

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ జె.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున ఉద్యోగులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు రక్తదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేసే దాతలు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి రావాలిన కోరారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ విఆర్‌కె.చౌదరి అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఫిజియోథెరపీ ద్వారా అందిస్తున్న సేవలను అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.అపర్ణ, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కోమలి సతీష్ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తుండగా మంగళవారం ఎక్సైజ్ సిఐ కె. కాత్యాయని తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులో సతీష్ ను అదుపులో తీసుకుని అతని వద్ద నుంచి 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రాజోలు కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్‌విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు.



క్వారీ లారీ దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని తూర్పు లక్ష్మీపురం గ్రామ సమీపంలో మంగళవారం హైపవర్ విద్యుత్ వైర్లు తగిలి క్వారీ లారీ దగ్ధమయింది. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం..పంట పొలాల్లోకి పుంత రోడ్డు నిర్మాణ నిమిత్తం మట్టిని అన్‌లోడ్ చేసే క్రమంలో లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాగడంతో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని పసికట్టిన డ్రైవర్, క్లీనర్ దిగి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా దగ్ధమైంది.

పుష్కర ఘాట్ వద్ద శిశువు మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి పుష్కర ఘాట్ వద్ద శిశువు మృతదేహం పడి ఉంది. రేవులో ప్రజలు నడిచే దారి పక్కన గొయ్యిలో గుడ్డ చుట్టి ఉన్న ఈ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. కొవ్వూరు రూరల్ సిఐ విజయబాబు, తాళ్లపూడి ఎఎస్ఐ చక్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ముద్దె ఆ ప్రాంతాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. సిఐ ఆదేశాల మేరకు శవపరీక్ష కోసం శిశువు మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక ఆసుపత్రుల్లో పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం గోపాలపురం మండలం ప్రగడపల్లికి చెందిన మహిళ పురుడు పోసుకోవడానికి వచ్చిందని డాక్టర్ అశోక్ పోలీసులకు తెలిపారు. కడుపులోనే బిడ్డ చనిపోయిందని, ఆపరేషన్ చేసి బిడ్డను తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఆ బిడ్డను తామే ఖననం చేసుకుంటామని తల్లిదండ్రులు తీసుకువెళ్లిపోయారని డాక్టర్ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మనస్థాపానికి గురై పురుగుల మందు తాగిని ముక్కామల గ్రామానికి చెందిన కమాడి ధర్మారావు(40) మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ధర్మారావు తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల తెలిసిన అబ్బాయితో తన కుమార్తెకు పెళ్లి సంబంధం కుదిర్చాడు. ఈ విషయంలో భార్యతో వివాదం నెలకొంది. దీంతో మన స్థాపానికి గురై ఈ నెల 20న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని తణుకు పిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 21న మృతి చెందాడు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో పామాయిల్ తోట దగ్ధమైంది. అందులో వేసిన అంతర పంటలు పూరిగా కాలిబూడిదవ్వడంతో సుమారు రూ.లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించింది. బాధిత రైతు పోతుల రాజేష్‌రెడ్డి, ఫైర్ అధికారి అబ్రహాం తెలిపిన వివరాల మేరకు గోపాలపురం శివారులో రాజేష్ రెడ్డికి చెందిన 2.5 ఎకరాల్లో పామాయిల్ తోట వేశాడు. అందులో అంతర పంటలుగా అరటి, వక్క తోటలు వేశాడు. ఆ తోటలకు నీరు అందించేందుకు డ్రిప్పు ఏర్పాటు చేశాడు. మధ్యాహ్న ప్రాంతంలో పామాయిల్ తోటలో నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటల చెలరేగాయి. వెంటనే జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా హుటాహుటిన ఫైర్ వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే పామాయిల్, అరటి, వక్కపొడి, డ్రిప్పు పైపులు కాలిపోయినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొడవలి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందేలాపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడిపుంజులు, రూ.67,320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఆదాయాన్ని అందించే ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతూ దృష్టి సారించాలని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం వేగేశ్వరపురంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. మెరుగైన ఉత్పత్తులు వస్తాయన్నారు. తద్వారా అధికాదాయం సమూరుతుందన్నారు. అన్ని విధాలా అనుకూలమైన ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో సర్పంచ్ తో పాటు సచివాలయ సిబ్బంది, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల సంరక్షణపై పూర్తి శ్రద్ధ వహించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



సీమంతాలు నిర్వహించిన గర్భిణీ మహిళలతో కలెక్టర్ షాన్ మోహన్

మహిళల గర్భధారణ సమయం నుంచి మొదటి 1000 రోజుల సంరక్షణపై పూర్తి శ్రద్ధ వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలని, కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని తగినంత విశ్రాంతి తీసుకోవడం, మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం ద్వారా గర్భిణీ మానసిక ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల లోపు తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా ముఖ్యమైనవని అందులో బిడ్డ పుట్టిన గంట లోపు తల్లిపాలు ఇవ్వాలన్నారు. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని ఆయన సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు బిసిజి, ఒపివి హెపటైటిస్-బి టికాలు వేయించాలని సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుంచి 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాలు వివిధ శాఖల సమన్వయంతో గ్రామగ్రామాన, పట్టణాల్లో, వార్డుల్లో అలాగే ప్రతి పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ పుట్టిన ప్రతిబిడ్డ 2.5 కేజీలు ఉండాలని ఆయన తెలిపారు. తల్లి సరైన పోషకాహారం తీసుకోకపోయినట్లయితే తక్కువ బరువుతో పిల్లలు పుట్టి అనారోగ్యానికి గురవుతారని ఆయన అన్నారు. మెప్మా పీడీ ప్రియంవద మాట్లాడుతూ తల్లి మంచి ఆహారం తీసుకుంటేనే మంచి బిడ్డకు జన్మనిస్తుందని తద్వారా మంచి సమాజానికి దోహదపడతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిడి డి.నాగార్జున, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కెవి.సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ స్వర్ణలత, సిడిపిఒ టిడిఆర్.పద్మావతి, డిఆర్‌డిఎ ఎపిఎం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ నాతి బుజ్జిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ప్రజాశక్తి - గండేపల్లి

రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఎంపిపి చల్లగళ్ల దొరబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా గ్రామాల్లో నెలకున్న పలు సమస్యలను ఎంపిటిసి సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి చలగళ్ల దొరబాబు మాట్లాడుతూ ఎంపిడిఒ నాతి బుజ్జి ఉద్యోగన్నతిపై ఉన్నత అధికారిగా వెళ్లబోతున్నారని, ఆమె గత 24 సంవత్సరాలుగా ఎంపిడిఒగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నాతి బుజ్జిని ప్రజా ప్రతినిధులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగపార్వతి, ఆర్‌టిసి డిఎం సత్యనారాయణ, ఎపిఎం సన్యాసిరావు, పలు గ్రామాల సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం పట్టణ శివారులో ఉన్న కేంద్రంతోపాటు, జి.రాగంపేట గ్రామ పరిధిలో ఉన్న రెండు కేంద్రాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకున్న జాగ్రత్తలు, పని చేసే కార్మికులకు కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎడిఎఫ్ఒ ఎం.శ్రీహరిజగన్నాథ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవికుమార్, విఆర్ఒ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో స్నేహిత్‌కు 94వ ర్యాంక్

ప్రజాశక్తి - పిఠాపురం

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తుది ఫలితాల్లో పట్టణానికి చెందిన చెక్కా స్నేహిత్ ఆల్ ఇండియాలో 94వ ర్యాంకు సాధించాడు. స్నేహిత్ పుట్టింది పిఠాపురలోనే. ఐదో తరగతి వరకు స్థానిక ప్రయివేట్ పాఠశాలలో విద్యాభ్యాసం, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు గుంటూరులో, అనంతరం గుజరాత్‌లో అహ్మదాబాద్ ఐఐటిలో చేయడంతో పాటు ఎలక్ట్రికల్ ఇంజనీర్ చదివి ఆప్షనల్ సబ్జెక్టుగా మ్యాథమెటిక్స్ ఎంచుకున్నారు. కోచింగ్ తీసుకోవడంతో పాటు సొంతంగా చదవడంతో సివిల్స్‌లో ర్యాంకు సాధించినట్టు స్నేహిత్ తెలిపారు. తండ్రి వెంకట్ బిజినెస్ మెన్ కాగా తల్లి మాధురి కుమునిది గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్నేహిత్‌ను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

చదువు భారం కారాదు

ప్రజాశక్తి - కరప

పేద కుటుంబాల విద్యార్థులకు చదువు భారం కారాదనే మోడల్ స్కూల్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎంఇఒ కెబి.కృష్ణవేణి అన్నారు. మంగళవారం నక్కావారిపేటలో స్కూల్ వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ప్రయివేటు స్కూల్లో లక్షలు ఖర్చుపెట్టి చదివించడం వలన ఆర్థికభారం తప్పదని అన్నారు. ప్రభుత్వ స్కూల్లో పిల్లలకు అన్ని మౌళిక వసతులు కల్పించి, పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీణాధరి, ఎస్ఎంసి ఛైర్మన్ నాగదేవి, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలి వేశారు..చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని మాధవరాయునిపేటలో తన కుటుంబాన్ని వెలివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు గంజా చంటి కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో జరిగిన ఒక సంఘటనలో తన కుటుంబాన్ని మాధవ రాయుని పేట పెద్దలు వెలివేశారని తెలిపారు. ఈ వెలిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల తన గృహప్రవేశ కార్యక్రమానికి కూడా గ్రామం నుంచి ఎవరూ రాకుండా అడ్డుకున్నారని వాపోయారు. దీనివల్ల తీవ్ర మానసిక వేదనకు గురయ్యామని అన్నారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పిఠాపురం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ నెల 25వతేదీన పిఠాపురం ఎంఎల్ఎ, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మంగళవారం ఏర్పాట్లును పరిశీలించారు. తొలుత ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. అనంతరం ఆర్ఆర్‌బిహెచ్ఆర్ పాఠశాల మైదానం, రథాల పేటలోని అంబేద్కర్ సామాజిక భవనం, యు.కొత్తపల్లి గ్రామంలోని శివాలయం వద్ద టిటిడి కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, ఎఎస్‌పి మానిష్ పాటిల్ దేవరాజ్, బిసి కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్.రత్నరాజు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ఎడిసి విచారణ

ప్రజాశక్తి- శంఖవరం



ఉద్యోగులను విచారిస్తున్న ఎసి చంద్రకుమార్

అన్నవరం రత్నగిరిపై ఇఒకి ఉద్యోగుల మధ్య సమన్వయలోపంతో ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో మంగళవారం దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ విచారణ చేపట్టారు. మంగళవారం రత్నగిరికి వచ్చిన ఆయనకు అధికారులు ఆలయ లాంచనాలతో స్వాగతం పలికారు. స్వామివారి వ్రతం ఆచరించి దర్శించుకున్నారు. అనంతరం పాలక మండలి సమావేశం మందిరంలో ఇఒకి ఉద్యోగులకు మధ్య కొరవడిన అంతరాలపై విడివిడిగా విచారించారు. బుధవారం ఈ విచారణ కొనసాగుతుందని తెలుస్తోంది.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కాకినాడ



కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏలూరు సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. 2025 - 26 సంవత్సరానికి సోమవారం జరిగిన ఎన్నికల ఫలితాలు మంగళవారం తెల్లవారుజామున వెల్లడయ్యాయి. అధ్యక్ష పదవికి ఏలూరు సుబ్రహ్మణ్యం, పెందుర్తి ప్రసన్నకుమార్ పోటీ పడ్డారు. ఈ పోటీలో ఏలూరు సుబ్రహ్మణ్యం 238 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా చెక్కపల్లి వీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా పెన్మెత్స రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీగా బండి నరేంద్ర, కోశాధికారిగా కోకా వెంకటకృష్ణారావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జోకా విఎస్.విజయకుమార్, మహిళా రిప్రజెంటీవ్‌గా జి.దివ్యశ్రీవిద్య, సీనియర్ కమిటి మెంబర్‌గా నక్కా సంజీవకుమార్, జూనియర్ కమిటీ సభ్యులుగా మర్ల ప్రవల్లిక, గుత్తుల మంగరాజు, షేక్ ప్రేమ్‌జీర్, దుళ్ల నాగబాబు విజయం సాధించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

'కుడా' కార్యాలయ స్థలం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యాలయ భవన నిర్మాణం కోసం మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పట్టణ శివారు పాండవుల మెట్ట వద్ద స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, కమిషనర్ భావన, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, మండల సర్వేయర్ సామోరు, విఆర్ఒ సత్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ మాంసం సీజ్

ప్రజాశక్తి - కిర్లంపూడి

నిల్వ చేసిన మాంసాన్ని పంచాయతీ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని జగపతినగరం పంచాయతీలో మొగ్గ సింహాచలంకు చెందిన లైసెన్స్ దుకాణంలో రొట్టా ఏసుబాబు వ్యక్తి మాంసాన్ని విక్రయిస్తున్నాడు. సంబంధిత దుకాణంలో నిల్వ చేసిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు దాస్యం ప్రభాకర్ అనే వ్యక్తి పంచాయతీలో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సర్పంచ్ గుడాల శ్రీలత సూచన మేరకు పంచాయతీ ఎన్‌టిఆర్.రమేష్‌బాబు మంగళవారం సంబంధిత దుకాణాన్ని తనిఖీ చేశారు. కల్తీ మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిల్వ చేసిన సుమారు 5 కేజీల మాంసాన్ని సీజ్ చేశారు. సంబంధిత దుకాణం లైసెన్స్‌ను రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి గ్రామ టిడిపి అధ్యక్షుడు మద్దాల మణికంఠ స్వామి, వార్డు మెంబెర్లు కురుమళ్ళ చిన్ని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రజెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా వినోద్ మిశ్రా పార్టీ ఆవిర్భావ వేడుక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరంలోని వినోద్ మిశ్రా నగర్, లింగంపర్తి, తిరుమాలి, జె.అన్నవరం, పరిమితడక గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు అరుణ పథకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో కొసిరెడ్డి గణేష్, రెడ్డి ఆనంద్ పాల్, నాగులపల్లి అర్జునుడు, కోన గంగాధర్, గండేటి నాగమణి, కందుల వరలక్ష్మి, ఎద్దు బుజ్జమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

కాకినాడ సబ్ స్టేషన్‌లో 220 కెవి, ప్రతాప్ నగర్ సబ్ స్టేషన్‌లో 132 కెవి వైర్లు మరమ్మతులు కారణంగా ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం 7 నుంచి 1 గంట వరకు యానాం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫ్యాకల్టీలకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి



శిక్షణలో మాట్లాడుతున్న ఎన్ఐటి రిటైర్డ్ ప్రొఫెసర్ నాగేంద్రరావు

స్థానిక ఆదిత్య కళాశాలలో ఫ్యాకల్టీలకు 5 రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతిలో విద్యార్థులకు బోధన చేసేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తలెఇపారు. 'ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్, డెలివరీ సిస్టమ్స్' అనే అంశంపై శిక్షణా తరగతులు జరుగుతున్నాయని పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన అధ్యాపకులకు ఎన్ఐటి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సిఆర్.నాగేంద్రరావు టీచింగ్ లెర్నింగ్ టెక్నిక్, విద్యా బోధనలో సాంకేతిక వినియోగం, స్టూడెంట్ సైకాలజీ ఎలా అర్థం చేసుకోవాలి అనే అంశాలపై శిక్షణిచ్చారు. ఈ సమావేశంలో ఆదిత్య పాలిటెక్నిక్ డీన్ ఎవి.మాధవ రావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తున్న జ్యోతుల నవీన్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. మంగళవారం మండలంలోని యల్లమిల్లిలో నూతన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల మోహనరావు, కుంచే రాజా, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, పెనుమర్తి భాస్కరరావు, సుంకవిల్లి రాజు, కంటిపూడి సత్యనారాయణ, యర్రంశెట్టి బాబ్జి, కష్టార్జున చౌదరి పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - ఏలేశ్వరం



వికలాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న ఎంపిపి బుజ్జి

స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ చిన్నారులకు ఎంపిపి గొల్లపల్లి బుజ్జి చేతుల మీదుగా ఉపకరణాలను మంగళవారం అందజేశారు. సమగ్ర శిక్షణ అభియాన్ ఏర్పాటుచేసిన 12 రకాల ఉపకరణాలను మంగళవారం ఎంపిపి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను తమ సొంత వారిలా సాకుతున్న భవిత పాఠశాల సిబ్బందిని అభినందించారు.అదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎపిఒ సుధీర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో మొత్తం 58 ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా చెరువులు, కాలువల పూడికతీత పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈనెల 23 వ తేదీ నుంచి మండల పరిధిలోని ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం సురక్ష బీమా యోజనపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పథకంలో 18 నుంచి 70 సంవత్సరాల వయసు ఉన్న కూలీలు రూ.20 చెల్లిస్తే ఈ పథకంలో మరణానంతరం రూ.2 లక్షలు, కాళ్లు, చేతులు పని చేయలేకపోతే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో 2660 మంది కూలీలు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు.